## క్లుప్తంగా...

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: హుడాకాలనీ, ఎన్ఎంగూడ విద్యుత్ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు హుడా కాలనీ, పాండురంగానగర్, శివాజీనగర్, సీసీఎండి, సిక్‌చానీ, నందిముస్లాయిగూడ, ఎస్‌పినగర్, మారుతీనగర్, అత్తాపూర్, రాంబాగ్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

### హజ్‌కు బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 51 మంది యాత్రికులు హజ్‌యాత్రకు బయలుదేరారు. శుక్రవారం ఉదయం యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు. హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. పదిహేను రోజుల పాటు జరిగే హజ్ యాత్రను పూర్తి స్థాయిలో పర్యవేక్షించనున్నట్లు రుమస్య సంస్థ డైరెక్టర్ ఫయాజుద్దీన్ తెలిపారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరికలు



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ, తటస్థులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాల్యాద్రి నాయుడు ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మణికొండ నుంచి కార్లలో ర్యాలీగా వెళ్లిన నాయకులు రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మరో నాలుగు నెలలు పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారని నాయకులు తెలిపారు.

### విద్యుత్ డివిజన్ అధ్యక్షుడిగా గోపాలకృష్ణ



నూతన కమిటీ కార్యవర్గం

మణికొండ: ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజన్ 327 యూనియన్ అధ్యక్షుడిగా పి.గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా బి.కృపాభూషణం, వర్కింగ్ అధ్యక్షుడిగా ఎన్.రామరాజు, డివిజన్ సెక్రటరీగా ఎ.విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రమేష్, అసిస్టెంట్ సెక్రటరీగా జె.కృష్ణ, డివిజన్ ట్రెజరర్‌గా డి.మహేష్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల కార్యక్రమంలో సైబర్‌సిటీ సర్కిల్ రీజినల్ ప్రెసిడెంట్ కె. వెంకటేశ్వర్లు, రీజినల్ సెక్రటరీ హెచ్. శ్యాంసుందర్, కొండాపూర్ డివిజన్ సెక్రటరీ రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, తిరుమలహిల్స్ పార్క్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ప్రముఖ మెడికోవర్ ఆస్పత్రి డాక్టర్లు జనరల్ మెడిసిన్, గుండె సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వివరాలకు సంతోష్ ఫోన్ 73306 58080లో సంప్రదించాలని కోరారు.

### సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న సర్పంచ్ సతీష్

శంషాబాద్ రూరల్: హమీదుల్లానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. బడీడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని సర్పంచ్ సతీష్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌గౌడ్, వార్డు సభ్యులు పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా వార్డు కార్యాలయాల ప్రారంభం



వార్డు కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చనజయప్రకాష్



మైలార్‌దేవ్‌పల్లిలోని మధుబన్ కాలనీలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ, రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ రోడ్డు ప్రాంతంలో వార్డు కార్యాలయాలను శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, అర్చనజయప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సంబంధించిన ఇంజినీరింగ్ సెక్షన్, వార్డు ఆఫీస్ సెక్షన్, వార్డు యూబీసీ సెక్షన్, వార్డు శానిటరీ సెక్షన్, ఆ వార్డు ఎంటమాలజి సెక్షన్, వార్డు జలమండలి, కమ్యూనిటీ అగ్రికల్చర్, కంప్యూటర్ ఆపరేటర్, వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, పారిశుద్ధ్యం, తాగునీరు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, యూడీసీ తదితర విభాగాలు ప్రజలకు వార్డు స్థాయిలోనే అందుబాటులో ఉంటాయని వివరించారు. డివిజన్‌కి సంబంధించిన ప్రజలు తమ ప్రాంతాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటుగా ఇతర అంశాలకు సంబంధించిన వార్డు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కుమార్, యువజన విభాగం అధ్యక్షులు రఘుయాదవ్, అడికే అర్జున్, జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఎల్.వి.రెడ్డి, రాజావర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాండురంగారెడ్డి, ఏన్ను శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, రామకృష్ణ, కుమార్, పాండు యాదవ్, టి.చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, మన్మోహన్‌రెడ్డి, మజ్హార్, బబ్లూ, ప్రభుదాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రజావసరాలు తీరుతున్నాయి

మణికొండ: పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో ప్రజావసరాలు తీరుతున్నాయని, దశాబ్దాలుగా కాని అభివృద్ధి, సంక్షేమ పనులు 9 సంవత్సరాలలో జరిగాయని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలలో చైర్మన్‌లు నరేందర్ ముదిరాజ్, డి.రేఖయాదగిరి అధ్యక్షతన నిర్వహించిన పట్టణ ప్రగతి ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయినా ప్రజా సమస్యలు తీరలేదని, రాష్ట్రం సిద్ధించాక అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో ప్రధానంగా ఉన్న విద్యుత్, తాగునీరు లాంటి ప్రధాన సమస్యలను ఆరు నెలల్లోనే సీఎం కేసీఆర్ అధిగమించి విమర్శకుల నోర్లు మూయించారన్నారు. నియోజకవర్గంలో పార్టీలు, రాజకీయాలకు భిన్నంగా అభివృద్ధే ధ్యేయంగా అన్నాదమ్ములుగా కలిసి పనిచేస్తున్నామని, అధికారుల పనితీరు ఎంతో గొప్పగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే మున్సిపాలిటీ వాహనాలతో ర్యాలీలు, సభా స్థలాలలో ఉత్సవాలు, బతుకమ్మలతో మున్సిపల్ కార్మికులు, ప్రజలు సందడి చేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా డ్వాక్రా మహిళా సంఘాలు, మున్సిపల్ కార్మికులకు పెరిగిన జీతాల చెక్కులను అందజేశారు. మున్సిపాలిటీలలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో ప్రచురించిన బుక్‌లెట్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్‌లు ఫల్గుణ్‌కుమార్, సత్యబాబు, జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ రాజశేఖర్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి, మున్సిపల్ మేనేజర్‌లు బీఎస్‌కే రమేష్, యోగేష్, కౌన్సిలర్‌లు, కోఆప్షన్‌సభ్యులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మణికొండలో మున్సిపల్ కార్మికులకు పెరిగిన జీతాల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

## కేటీఆర్ చేతుల మీదుగా పట్టణ ప్రగతి అవార్డు



శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీకి పట్టణ ప్రగతి అవార్డును పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అందజేశారు. శుక్రవారం రాత్రి నగరంలోని శిల్పకళావేదికలో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. పట్టణ ప్రగతిలో శంషాబాద్‌కు అవార్డు రావడంపై మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా వారిని అభినందించారు.

## 18న బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం బాల బృందావనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పిల్లల కోసం ప్రత్యేకంగా సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'బెనిఫిట్స్ ఆఫ్ రాజయోగ' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా యోగాసనాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

# మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం



వైఎస్సార్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన డీఈ శివశంకర్

మణికొండ: ప్రజావసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యుత్ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఇబ్రహీంబాగ్ డివిజన్ డీఈ శివశంకర్ అన్నారు. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ, వైఎస్సార్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గండిపేట మండల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యుత్ వాడకం విపరీతంగా పెరిగిపోతుందన్నారు. ప్రతి సంవత్సరం విద్యుత్ వాడకం పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్‌ఫార్మర్‌లు, సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాలను పెంచుతున్నామన్నారు. వినియోగదారులు సకాలంలో తమ బిల్లులను చెల్లించి సంస్థకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ జాయింట్ సెక్రటరీ రవి, సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ సందీప్‌రెడ్డి, లైన్‌మెన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం లభ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ రాంభూపాల్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయదుర్గంలోని వెల్స్‌ఫార్గో భవనం వెనుక మధురానగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయం వెనుక ఓ వ్యక్తి పడి ఉన్నాడని గురువారం మధ్యాహ్నం స్థానికులు ఫిర్యాదు చేశారు. పరిశీలించగా అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని, ఎలాంటి వివరాలు తెలియలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 9490617191 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

# విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గోల్కొండ: వర్షాకాలంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన రింగ్ రోడ్డులోని మొఘల్‌ఖనాల ఫంక్షన్ హాల్‌లో కార్వాన్ నియోజకవర్గానికి చెందిన విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పటిష్టమైన కంచె ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో విద్యుత్ ఎర్తింగ్ కాకుండా చూడాలని కోరారు. అంతేకాకుండా గతంలో వదులుగా ఉన్న విద్యుత్ తీగలు భవనాలకు తగిలి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ, డీఈలతో పాటు నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

## మహంకాళేశ్వరి మహాభిషేకానికి ఏర్పాట్లు

చార్మినార్: ఆషాఢమానం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఈనెల 20న మహంకాళేశ్వర పరివార సహిత మహంకాళేశ్వరి మహాభిషేకం పూజా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. లోక కల్యాణార్థం మహంకాళేశ్వరి మహాభిషేకం కార్యక్రమాన్ని ఉత్సవాల నిర్వాహకులు ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈసారి జరిగే ఉత్సవాలను కొడకండ్ల శ్రీరామశరణ్ శర్మ, అలంకార బ్రహ్మశ్రీ శృంగారం ఆత్రేయాచార్యుల నిర్వాహణలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అంజనేయ స్వామి, నవగ్రహ తదితర ప్రత్యేక అభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహాభిషేకం సందర్భంగా భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఇప్పటి నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

# ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా తెలంగాణ రాష్ట్రంలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ జోస్యం చెప్పారు. శుక్రవారం మాదాపూర్‌లోని సాయినగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తీర్చలేక ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఖానామెట్ సర్వే నెంబర్ 41, 11/7లో కబ్జాదారులకు బీఆర్ఎస్ నాయకులు అండగా నిలుస్తున్నారని, స్మశాన వాటికనూ వదలడం లేదని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్రరావు, రాధాకృష్ణ యాదవ్, భిక్షపతి ముదిరాజ్, గోపాల్, మధుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మాధవచారీ, భారతి, పార్వతి, నాగులు, సురేష్ పాల్గొన్నారు.

స్టాలిన్‌నగర్‌లో..

మియాపూర్: రాష్ట్ర ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసేంది ఏమీ లేదని ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యావ్ ఆరోపించారు. మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్ కాలనీలో గడప గడపకు బీజేపీ పాదయాత్ర శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ బీజేపీ నాయకులతో కలిసి కాలనీలో ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్టాలిన్‌నగర్‌లో మంచినీటి కోసం ఇక్కట్లు పడుతుంటే ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రిస్తున్నారన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాఘవేందర్‌రావు, నాగులుగౌడ్, లక్ష్మణ్, ముఖేష్, కాశీనాథ్, సునీల్, అభిషేక్, దుర్గేష్, నాయకులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మహంకాళి వజ్రోత్సవాలు



చండీహోమం నిర్వహిస్తున్న అలయ కమిటీ సభ్యులు

యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయం 75వ వార్షిక బోనాల వజ్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 52వ రోజు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల కుటుంబీకులు అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, కార్యనిర్వాహ కార్యదర్శి ఎస్.పి క్రాంతికుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థులకు చక్కటి అవకాశాలు

విజయనగర్‌కాలనీ: పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని సంస్థలు పరిశ్రమల్లో చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరీ దేవి తెలిపారు. డిప్లొమా కోర్సులపై శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సివిల్, ఎలక్ట్రిషియన్, మెకానిక్ తదితర విభాగాలలో డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులకు త్వరితగతిన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంచి తద్వారా ఉద్యోగా, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ కోర్సులు దోహద పడుతాయన్నారు. అవగాహన కార్యక్రమంలో ఎం.లక్ష్మయ్య, పి.రామిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుంది

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం అనేక అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుందని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. హిమాయత్‌సాగర్‌లోని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవాన్ని చేపట్టారు. అధికారులు, కార్మికులతో కలిసి తెలంగాణ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. నూతన హరితహారం వాహనం, టౌన్ ప్లానింగ్ డిజాస్టర్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామీణ బ్యాంకు మహిళా సంఘాలకు 1.10 కోట్ల రూపాయల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్మికులకు మౌలిక సదుపాయాలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు తలారీ చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతిపాపయ్యయాదవ్, ప్రశాంత్‌నాయక్, ముద్దం రాము, ఆసియాఖాజా, అనితవెంకటేష్, మేనేజర్ వేణుగోపాల్, డిప్యూటీ ఇంజనీర్ యాదయ్య, రెవెన్యూ అధికారి నిర్మల, శానిటేషన్ అధికారి నరేష్, మెప్మా అధికారి శ్రీలత, మధుమతి పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

# మణికొండ మున్సిపాలిటీకి ఉత్తమ అవార్డు

మణికొండ: ఘన వ్యర్థ పదార్థాలతో ఇందనం తయారు చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు బ్రికెట్స్ సరఫరా చేసి ఆదాయ వనరులు పెంచుకునే వినూత్న ప్రయత్నం చేస్తున్న మణికొండ మున్సిపాలిటీని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, శానిటేషన్ రంగంలో ఉత్తమ సేవా పత్రం, మెమొంటోను అందజేసింది. శుక్రవారం రాత్రి నగరంలోని శిల్పకళావేదికలో జరిగిన రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవంను పురస్కరించుకుని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్‌కు మంత్రి కేటీఆర్ వాటిని అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజూ వస్తున్న పొడి చెత్తతో సిమెంట్ సంస్థలకు అవసరమైన బ్రికెట్స్‌ను తయారు చేసి అదాని సంస్థకు విక్రయిస్తున్నారు. ఆ విషయాన్ని గుర్తించి గతంలోనే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉత్తమ పర్యావరణ అవార్డును మున్సిపాలిటీకి అందజేసిన విషయం తెలిసిందే. అవార్డును అందజేసిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ శాఖ డైరెక్టర్, అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ, ఎమ్మెల్యే యాదయ్య, పైలెట్ రోహిత్‌రెడ్డి, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న నరేందర్‌ముదిరాజ్, ఫల్గుణ్‌కుమార్

## వీరశైవ లింగాయత్‌ల అభ్యున్నతికి నిధులను కేటాయించాలి



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులకు ఇస్తున్న లక్ష రూపాయాల ఆర్థిక సాయం వీరశైవ లింగబలిజ కులస్తులకు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడు వి.ఈశ్వరప్ప కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్ని వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నిధులను కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోను వీరశైవ లింగాయత్ అభివృద్ధికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, యువజన అధ్యక్షులు కె.రాజప్ప, కేంద్రకమిటీ సభ్యులు డాక్టర్ కె.శివప్ప పాల్గొన్నారు.



# బీసీలందరికీ 'బీసీ బంధు' వర్తింపజేయాలి

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్రంలోని బీసీలందరికీ బీసీ బంధు పథకం వర్తింపజేయాలని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం చైర్మన్ చిట్టబోయిన నందకిశోర్ యాదవ్, సభ్యుడు పాండుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గౌలిగూడలోని యాదవ సంఘంలో ఏర్పాటు చేసిన యాదవ కులాల, సంఘాల సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జోక్యం చేసుకొని సీఎం కేసీఆర్‌ను ఒప్పించి యాదవులకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్ యాదవ్, రామారావుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రమేష్‌యాదవ్, రాజుయాదవ్, సత్యంయాదవ్, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మురళీ యాదవ్ పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతికి తరలిన జీహెచ్ఎంసీ అధికారులు

గచ్చిబౌలి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం రాష్ట్ర స్థాయి పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ నుంచి జోనల్ కమిషనర్ శంకరయ్య, డీసీ వెంకన్న బస్సులో శిల్పకళా వేదికకు తరలివెళ్లారు. చందానగర్ సర్కిల్ నుంచి డీసీ సుదాంష్ ఆధ్వర్యంలో అధికారులు వెళ్లారు.



## నిలోఫర్‌లో రక్తదాన శిబిరం

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిలోఫర్ ఆస్పత్రిలో తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం సెంట్రల్ జోన్ పోలీసులు రక్తదానం చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం సెంట్రల్ జోన్ కమాండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో తెలంగాణ ప్రత్యేక రక్షణ దళ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ పి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. మహిళలు, చిన్న పిల్లల చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రిలో రక్తం కొరతను అధిగమించుటకు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి అభ్యర్థన మేరకు సుమారు వంద యూనిట్ల రక్తాన్ని సేకరించి అప్పగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.హరి జె.వి.రమణారెడ్డి, ఎస్.బాబు రెడ్డి, ఎస్.రాఘవేంద్ర, ఇన్‌స్పెక్టర్లు ఎం.ఎస్.రెడ్డి, బండి రాజు, శ్రీధర్ గౌడ్, జి.శ్రీనివాసరావు, ఎస్సైలు, ఏఎస్సైలు పాల్గొన్నారు.

# షేక్‌పేట్‌లో రైతుబజార్ ఏర్పాటు చేయాలి

గోల్కొండ: షేక్‌పేట్‌లో రైతుబజార్ ఏర్పాటు చేయాలని స్థానికులు సుదీర్ఘకాలంగా అధికారులను కోరుతున్నారు. గత దశాబ్దం కంటే నేడు షేక్‌పేట్ డివిజన్ ఎంతగానో అభివృద్ధి చెందింది. కాలనీలు కూడా వెలిశాయి. ఈ ప్రాంతం వారు కూరగాయలు కొనాలంటే మెహిదీపట్నం రైతుబజార్ లేదా గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తుస్తంది. దీంతో వారు వ్యయప్రయాసాలకు లోనవుతున్నారు. షేక్‌పేట్, టూంబ్స్ చౌరస్తాలో జరిగే వారాంతపు సంతలలో సైతం వ్యాపారులు తాజా కూరగాయలను అమ్మడం లేదని, ధరలు కూడా ఎక్కువగా ఉంటాయని స్థానికులు అంటున్నారు. టూంబ్స్ చౌరస్త వద్ద గల విశాలమైన రక్షణ శాఖకు చెందిన కొంత స్థలంలో రైతుబజార్ ఏర్పాటు చేస్తే సుమారు 70 కాలనీల వారికి ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం మెహిదీపట్నంలో కొనసాగుతున్న రైతుబజార్ కూడా రక్షణ శాఖ వారికే చెందినది కావడం గమనార్హం.